నమస్తే తెలంగాణ
సిద్ధిపేట
I | హైదరాబాద్, శనివారం 23 నవంబర్ 2024 | SIDDIPET

'నమస్తే' కథనంతో రంగంలోకి ఇంటలిజెన్స్

సిద్దిపేట, నవంబర్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కల్యాణలక్ష్మిపై దళారీ గద్దలు ' అనే శీర్షికతో శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం ఉమ్మడి మెదక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.అధికార యంత్రాంగంలో ఓ హాట్ టాపిక్ అయ్యింది. రెవెన్యూ అధికారులు ఇదే అంశంపై చర్చించుకున్నారు. 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై జిల్లాస్థాయి అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఇంటలిజెన్స్ అధికారులను రంగంలోకి దింపినట్లు తెలిసింది. తహసీల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో దళారులకు ఎవరెవరు సహకరిస్తున్నారు అనే వివరాలను సేకరిస్తున్నారు. మాటిమాటికి తహసీల్ కార్యాలయాలకు వచ్చి పైరవీలు చేస్తున్న నేతలు ఎవరు..? వారు ఏమేమి పనుల మీద వస్తున్నారు..? వారి వెనుక ఉన్న అధికారులు ఎవరు..? ఇలా పలు కోణాల్లో ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. కొంతమంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారుల వద్దకు వెళ్లి డబ్బులు ఏమైనా ఇచ్చారా..? ఎవరికి ఇచ్చారు..? అనే అంశాలను ఆరాతీస్తున్నట్లు తెలిసింది.

ప్రజాగ్రహం..!

- గ్రామాల్లో కళాజాతలను అడ్డుకుంటున్న ప్రజలు
- హామీలు విస్మరించి మోసం చేశారని ప్రభుత్వంపై మండిపాటు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక చోట్ల నిరసనలు
- విజయోత్సవాలపై కాంగ్రెస్ క్యాడర్‌లోనూ అయిష్టత

ఏం సాధించారని ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తున్న ప్రజలు

అయ్యా రేవంత్‌రెడ్డి..మీ పాలన ఏడాది దగ్గరకు వస్తున్నది..ఇచ్చిన హామీలు ఏమయ్యాయి...ఏం సాధించారని ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుతున్నారు. దీనికోసం ఎందుకు ఈ కళాజాతలు.. చాలు చాలు ఇక పోండి అంటూ గ్రామాల్లో ప్రజలు తిప్పి పంపుతున్నారు. గురువారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం రావురూకులలో ప్రజలు ప్రజాపాలన విజయోత్సవాలపై ఏర్పాటు చేసిన కళాజాతను పంపించి నిరసన తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో చాలా గ్రామాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాపాలన విజయోత్సవాలపై కాంగ్రెస్ క్యాడర్ సైతం పెదవి విరుస్తుండడం విశేషం.

గురువారం సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామంలో సంవత్సర కాలంలో ఏం చేశారంటూ కాంగ్రెసోళ్లను నిలదీస్తున్న గ్రామస్తులు

సిద్దిపేట, నవంబర్ 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 9కి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. కానీ, ప్రజాపాలన విజయోత్సవాలకు ప్రజల నుంచి స్పందన కరువైంది. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కళాజాత ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వరంగల్‌లో ప్రజాపాలన విజయోత్సవం సందర్భంగా జిల్లా మంత్రులు అన్ని జిల్లా కేంద్రాల్లోను, మంత్రుల నియోజకవర్గ కేంద్రాల్లోను కళాజాతలను ప్రారంభించారు. ఈ కళాజాతలు ఊరూరా తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తున్నాయి. ఈ ఏడాదిలో రేవంత్ సర్కార్ ఏం చేసిందని గ్రామాల్లోకి వచ్చిన కళాజాత ప్రదర్శనలను ప్రజలు నిలదీస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయలేవని, అన్ని చేశామంటూ పాటల రూపంలో వివరిస్తున్నారా..? అంటూ గ్రామాలకు వచ్చిన కళాజాత కళాకారులపై ప్రజలు మండి పడుతున్నారు. అధికారంలోకి రాగానే పింఛన్ రెట్టింపు చేస్తా అని చెప్పారు. ఎక్కడ చేశారూ చెప్పలంటూ నిలదీస్తున్నారు. రైతులకు పంట రుణమాఫీ కాలేదని, రైతుభరోసా ఇవ్వడం లేదని, మహిళలకు ఇస్తానన్న రూ. 2500 ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. మీరు వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి ఇవి చేసిండు..అవి చేసిండు అంటూ పాటలు పాడుతున్నారా..? అంటు ఆయా గ్రామాల్లో ప్రజలు తిరగబడుతున్నారు. కాంగ్రెస్ పారీ ఏడాది పాలనలో అన్నివర్గాలకు అన్యాయం జరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ ఒక్క వర్గం రేవంత్ రెడ్డి సర్కార్ న్యాయం చేయలేదన్నారు. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి వనరుల్లో ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని నిర్లక్ష్యం చేసిందని మత్స్యకారులు మండిపడుతున్నారు. గొర్రెల పంపిణీ నిలిచిపోయిందని గొల్ల కుర్మలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళితబంధు ఇవ్వకుండా ప్రభుత్వం దళితులను అన్యాయం చేస్తున్నదని ఆ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. హామీలు అమలు చేయకుండా మోసం చేసి ఇప్పుడు ప్రజాపాలన విజయోత్సవాలు అంటూ మళ్లీ మా ముందుకు వస్తారా అని ప్రజలు మండిపడుతూ ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు.

కాంగ్రెస్ క్యాడర్‌లోనూ అయిష్టత...

ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి సంబంధించి జిల్లా మంత్రులు తొలిరోజు జెండాలు ఊపడం వరకే పరిమితమయ్యారు. గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవాలపై విజయవంతంపై శ్రద్ధ పెట్టడం లేదు. తమ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించడానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుకు రావడం లేదు. సొంత పార్టీ నేతలే విజయోత్సవాలపై పెదవి విరుస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం తప్పా పూర్తిస్థాయిలో ఏం చేశామంటూ వారికి వారే ప్రశ్నించుకుంటున్నారు. ఇప్పటికే రెండుసార్లు రైతు బంధుకు ఎగనామం పెడితిమి. పూర్తిగా పంట రుణమాఫీ చేయకపోతిమి.. పింఛన్లు పెంచక పోతిమి..ఏడాదిగా రూపాయి అభివృద్ధి చేయకపోతిమి.. గ్రామాలకు ఏ మొఖం పెట్టుకొని పోతామంటూ ప్రజాపాలన విజయోత్సవాలపై కాంగ్రెస్ శ్రేణులు నిట్టూరుస్తున్నారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం ప్రజాపాలన విజయోత్సవాలపై పెద్దగా శ్రద్ధ చూపడం లేదని సొంత పార్టీ నేతలే పెదవి విరుస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏ మంచి కార్యక్రమం చేసినా దానిని పండుగలా నిర్వహించి ప్రజల్లోకి వెళ్లేవారు. ఇవాళ ఆ పరిస్థితులు లేవని కాంగ్రెస్ పార్టీ నేతలు చెప్పుకొంటున్నారు. ఏడాది కాలంలోనే తమ పార్టీపై బాగా వ్యతిరేకత ఏర్పడిందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకొంటున్నారు.

గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

కాంగ్రెసోళ్లకు అవగాహన లేదు

- దమ్ముంటే హరీశ్‌రావు సవాల్‌ను స్వీకరించాలి
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబర్ 22: నదులు, ప్రాజెక్టులపై కనీస అవగాహన లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం గజ్వేల్‌లోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ..కొండపాచమ్మ సాగర్‌ను కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం కోసం నిర్మాణం చేసిండని రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి మాట్లాడడం ప్రాజెక్టులపై వారికి ఏమాత్రం అవగాహన లేదనే విషయం ప్రజలకు అర్థమవుతుందన్నారు. ప్రజలు విజ్ఞులని, వారికి అన్ని విషయాలు తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా హామీల అమలులో విఫలం కావడంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని మండిపడ్డారు. కొండపోచమ్మ సాగర్ నిర్మాణంతో కూడవెళ్లి వాగు మీదుగా సాగునీరు అప్పర్ మానేరుకు చేరుతుందని, సంగారెడ్డి కాలువ ద్వారా ఎస్ఆర్ఎస్పీ, నిజాంసాగర్‌కు గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించినట్లు తెలిపారు. తుర్కపల్లి కాలువ ద్వారా భువనగిరి, ఆలేరుకు నీటిని అందిస్తున్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై తిట్ల పురాణం తప్పా ప్రజలకు రేవంత్ చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. భద్రత లేకుండా ప్రజల్లోకి వస్తే రేవంత్‌రెడ్డికి తెలుస్తదని, ఇప్పుడు ఎన్నికలు పెడితే కాంగ్రెస్‌కు ఒక్కసీటు రాదన్నారు. తెలంగాణలో ప్రజల బతుకులు ఆగమయ్యాయని, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు, రుణమాఫీ చేయడంలో, 42గంటల కరెంట్ ఇవ్వడంలో ఫెయిల్ అయిందన్నారు. హరీశ్‌రావు విసిరిన సవాల్‌ను స్వీకరించి కబ్జాలను చూపించాలని, నోటికొచ్చినట్లు ఏదిపడితే అది మాట్లాడటం తగదన్నారు. దమ్ముంటే బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేర్పించుకున్న 11మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలువాలని, వారు గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టులను నిర్మించారని, ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును కాళేశ్వరం నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 50 ఏండ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ తెలంగాణకు ఏమి చేసిందో చెప్పాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మండల, పట్టణ అధ్యక్షులు బెండే మధు, నవాజ్‌మీరా, కౌన్సిలర్ అల్వాల బాలేశ్, మెట్టయ్య, మ ద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కాసీం, నర్సింగరావు, రవీందర్, ఉమార్, ఆర్‌కే శ్రీనివాస్, దుర్గాప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కల్యాణ్‌కర్ శ్రీనివాస్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట: గొల్లపల్లిలో వర్మి కంపోస్టును పరిశీలిస్తున్న యూనిదాస్ ప్రతినిధులు

సేంద్రియ సాగు విధానం పరిశీలన

అక్కన్నపేట, నవంబర్ 22: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పలు గ్రామాలను శుక్రవారం మానోస్ యూనిదాస్ ప్రతినిధులు సందర్శించారు. లోడి సాంఘిక సేవా సంస్థ మండలంలోని మైసమ్మవాగు తండా, చౌడ్‌తండా, మబ్బుకుంట, పంచరాయ, డేక్యాతండా, గండిపెల్లి, గొల్లపల్లి గ్రామాల్లో సేంద్రియ విధానంలో చేస్తున్న వ్యవసాయాన్ని బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా లోడిసాంఘిక సేవాసంస్థ డైరెక్టర్ సింగిరెడ్డి ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయాన్ని తమ సంస్థ ప్రోత్సహిస్తున్నదని, దీనికోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు కూరగాయల విత్తనాలు, వర్మీ కంపోస్టు పిట్స్, చెరువు, బావిపూడిక పనులు, చెక్‌డ్యామ్ నిర్మాణం, కోడిపిల్లల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మానోస్ యూనియన్ ప్రతినిధులు రోశియోమోనెట్‌కెవరో, ఆల్బర్ట్ మార్టినేజ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి, ఫీల్డ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, మాజీసర్పంచ్ చందబోయిన కుమార్, మాజీ ఉపసర్పంచ్ రాములు, లక్ష్మణ్, రవికుమార్, తిరుమల, రమేశ్, కృష్ణ, అజయ్, తిరుపతి ఉన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్ మండల పరిధిలో అక్రమ కట్టడాలను కూల్చేస్తున్న అధికారులు

అమీన్‌పూర్ నవంబర్ 22: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని దాయరా పంచాయతీ పరిధిలో సర్వేనంబర్ 30లో 720 ఎకరాల ఇనాం భూమిలో కొందరు కబ్జాదారులు అనుమతులు లేకుండా లేఔట్లు గీసి చిన్న చిన్న రూమ్‌ల నిర్మాణం చేపట్టి అమ్మకాలు ప్రారంభించారు. అమీన్‌పూర్ తహసీల్దార్ రాధా ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పోలీసుల భద్రత మధ్య శుక్రవారం అక్రమ కట్టడాలను కూల్చివేశారు. చుట్టూ వేసిన ఐరన్ షీట్లతో వేసిన కంచెను తొలిగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ..సర్వేనంబర్ 30లో కొంతమంది అనుమతులు తీసుకోకుండా అక్రమ కట్టడాలు చేపట్టారని, వాటిని కూల్చివేశామని అన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చూపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంద్రేశంలో...

పటాన్‌చెరు, నవంబర్ 22: సంగారెడ్డి జిల్లా ఇంద్రేశంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుభాష్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నవ్వ సెంట్రల్‌లో గోపాల్ అనే వ్యక్తి పర్మిషన్లు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని గుర్తించిన పంచాయతీ సిబ్బందితో కూల్చివేతలు జరిపారు. స్లాబ్‌ను మిషన్‌లు వాడి కూల్చారు. గోడలను తొలిగిస్తున్నారు. పంచాయతీ అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేస్తున్నామని, ఆరు నిర్మాణాలను గుర్తించామని, వాటిని తొలిగిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాన్ని తొలిగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రామాయంపేట మండలంలో లింక్ రోడ్లపైనే పంట నూర్పిళ్లు చేస్తున్న రైతులు

రోడ్లపై వడ్ల రాశులు.. ప్రమాదాలకు పిలుపులు

జిల్లాలో వానకాలం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏ రోడ్డు చూసినా వడ్ల రాశులతో కనిపిస్తున్నది. రైతులు రోడ్లపైన పంట నూర్పిళ్లు చేస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పంట నూర్పిళ్ల మూలంగా ఎంతోమంది వాహనదారులు మృత్యువాడికి చేరుకుంటున్నారు. ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒక ఘటనలో ముగ్గురు, మరో ఘటనలో ఇద్దరు చనిపోయారు. రామాయంపేట ఉమ్మడి మండల వ్యాప్తంగా ఎటుచూసినా రోడ్ల వెంట పంటనూర్పిళ్లే కనిపిస్తాయి. ఉమ్మడి మండల కేంద్రం రామాయంపేట నుంచి గజ్వేల్, మెదక్ వెళ్లే దారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో రైతులు వరి, మొక్కజొన్న నూర్పిళ్లు చేపడుతూ రహదారులను మొత్తం ఆక్రమిస్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై రైతులు ధాన్యం పోయకూడదని, రోడ్లపై పంట నూర్పిళ్ల మూలంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రామాయంపేట సీఐ వెంకటరాజిగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రామాయంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో రోడ్లపై నూర్పిళ్లు చేస్తున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. **- రామాయంపేట, నవంబర్ 22**

రామాయంపేట- గజ్వేల్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

ధర్మకర్తల మండలి

నియామకానికి దరఖాస్తులు

కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం

ఝరాసంగం, నవంబర్ 22: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసేందుకు దేవాదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏటా రూ.4 కోట్లకు పైగా ఆదాయం ఉన్న కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయం 6ఏ జాబితాలో ఉంది. ఆలయ నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన, అభివృద్ధి, ఉత్సవాలు, జాతర నిర్వహణ కోసం దేవదాయ శాఖ మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వం ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తున్నది. ఆలయ ధర్మకర్తల మండలి పదవీకాలం గతేడాది అక్టోబర్‌లో ముగిసింది. పాలకమండలి లేక పోవడంతో ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. ఆలయ ధర్మకర్తల మండలిలో 14 పోస్టులు ఉన్నాయి. ఇందులో ఎస్సీ లేదా ఎస్టీలకు ఒకటి, మహిళలకు ఒకటి, ఒక డోనర్‌కు అవకాశం ఉంది. ఆలయ ప్రధాన పూజారి ఎక్స్ అఫీషియా మెంబర్‌గా ఉంటారు. ఆలయ చైర్మన్, ధర్మకర్తల పదవులను దక్కించుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంత్‌రావు పటేల్ వద్దకు వెళ్లి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆసక్తి గలవారు సంగారెడ్డిలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో రెండు వారాల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో శశిధర్ సూచించారు. సత్ప్రవర్తన కలిగి, వయస్సు 35 ఏండ్లకు పైబడిన వారు, పోలీస్ కేసులు లేనివారు ధర్మకర్తల మండలి పోస్టుకు అర్హులన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ

నియామకం

హుస్నాబాద్, నవంబర్ 22: హుస్నాబాద్ వ్యవసాయ కమిటీ నూతన పాలకవర్గాన్ని మార్కెటింగ్ అధికారులు శుక్రవారం ప్రకటించారు. మార్కెట్ చైర్మన్‌గా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన కంది తిరుపతి రెడ్డి, వైస్‌చైర్మన్‌గా హుస్నాబాద్ మండలం తోటపల్లికి చెందిన బంక చందు, మరో 12మంది డైరెక్టర్లుగా బొడిగె పరశురాములు, పత్తిపాక త్రిమూర్తి, ఓరుగంటి భారతి, పోతుగంటి బాలయ్య, మహ్మద్ కుతుబుద్దీన్, బొంగోని శ్రీనివాస్, లావుడ్య బిక్యా, మడప యాదవరెడ్డి, కరంటోతు రవి, బైకని శ్రీనివాస్, తేరాల మారుతి, తనుకు ఆంజనేయులు నియామకమయ్యారు. వీరితో పాటు పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఏడీఏ, మున్సిపల్ చైర్‌పర్సన్లు కూడా సభ్యులుగా ఉంటారు. కమిటీ నియామకం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న అందె భాస్కర్

అందె భాస్కర్‌కు ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డు

మిరుదొడ్డి, నవంబర్ 22: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన అందె (అంగడి) భాస్కర్ డప్పు వాయిద్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందా డు. ఆయనకు 2022-23 సంవత్సరానికి కేంద్ర సంగీత నాటక అకాడమీ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ అవార్డును ప్రకటించింది. 20 ఏండ్లుగా డప్పు వాయిద్యంలో కృషి చేసినందుకు శుక్రవారం ఢిల్లీలోని అంబేద్కర్ సెంటర్‌లో ఈ అవార్డును మినిస్టర్ ఆఫ్ కల్చర్ సెక్రెటరీ ఏకే శుక్లా, సంగీత నాటక అకాడమీ చైర్మన్ సంధ్యాపుచ్, అడిషనల్ సెక్రెటరీ రాజుదాస్ చేతులకు మీదుగా అవార్డు అందుకున్నారు. భాస్కర్‌ను పలువులు అభినందించారు.

ముగిసిన కొండపోచమ్మ వారోత్సవాలు

శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జగదేవ్‌పూర్, నవంబర్ 22: సిద్దిపేట జిల్లా తీగుల్ నర్సాపూర్ సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ అమ్మవారి 23వ ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు వేదమంత్రోచ్ఛరణల మధ్య శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. పూర్ణాహుతి, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రజితారమేశ్, యాదవరెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కవిత, ఈవో రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

లైంగిక దాడి కేసులో 20 ఏండ్ల జైలు

జహీరాబాద్, నవంబర్ 22: బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధిస్తూ శుక్రవారం సంగారెడ్డి జిల్లా సెషన్స్ పోక్సో జడ్జి కె.జయంతి తీర్పు వెలువరించినట్లు హద్నూర్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం..న్యాల్‌కల్ మండలంలోని అమీరాబాద్‌కు చెందిన మాలిపటేల్ వసంత్‌రావు అలియాస్ చింటూ బాలికను పెండ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకుని గర్భవతిని చేశాడు. తను గర్భిణి అయిన విషయాన్ని బాలిక అతడికి చెప్పడంతో మాత్రలు వేయించి, అబార్షన్ చేయించాడు. దీనిపై బాలిక కుటుంబసభ్యులు 2018 జూలై 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో హద్నూర్ ఏఎస్సై ఈశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించి సెషన్స్ పోక్సో జడ్జి కె.జయంతి నిందితుడికి శిక్ష ఖరారు చేశారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ అభినందించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిపై కేసు

టేక్మాల్, నవంబర్ 22: తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తండ్రిపై కూతురు శుక్రవారం టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం...టేక్మాల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏండ్ల బాలిక పట్ల కొన్నాళ్లుగా తండ్రి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని కూతురు తల్లితో చెప్పింది. భార్య భర్తకు సర్ధిచెప్పినా వినిపించుకోలేదు. భార్యను కొట్టేవాడు. దీంతో తల్లీకూతురు భయపడి వారి అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయారు. కొన్ని రోజుల తర్వాత అతను భార్య వద్దకు వెళ్లి మంచిగా ఉంటానని నమ్మబలికాడు. కూతురు, భార్యను తీసుకుని స్వగ్రామానికి వచ్చాడు. కొన్ని రోజులపాటు మంచిగానే ఉన్న తర్వాత అతడు మళ్లీ తన నైజాన్ని ప్రదర్శించడం మొదలు పెట్టాడు. 21న ఉదయం కూతురు స్కూల్‌కు వెళ్లడానికి సిద్ధమవుతుండగా అసభ్యకరంగా ప్రవర్తించాడు. తల్లి పొలం పనికి వెళ్లడంతో భయపడి స్కూల్‌కు వెళ్లిపోయింది. 22న తెల్లవారుజామున నానమ్మ వద్ద పడుకున్న కూతురు తలుపు కొడుతూ బూతులు తిట్టడంతో భార్య, కొడుకు వచ్చి తండ్రిని అక్కడి నుంచి బయటకు తీసుకెళ్లారు. విసిగివేసారిన బాలిక తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడికి మూడేండ్ల శిక్ష

పటాన్‌చెరు, నవంబర్ 22 : బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడికి మూడేండ్ల శిక్షను విధిస్తూ సంగారెడ్డి జిల్లా సెషన్స్ పోక్సో కోర్టు జడ్జి కె.జయంతి శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం...18 ఏండ్ల కూతురు కనిపించడం లేదని 2019లో పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఆమె తండ్రి ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన మ్యాతరి జగన్/మహేంద్ర జగపతి (20)పై కిడ్నాప్ చేసినట్టు అనుమానం వ్యక్తం చేశాడు. అప్పటి పటాన్‌చెరు ఎస్‌హెచ్‌వో నరేశ్ నిందితుడిపై కేసు నమోదు చేసి చేశారు. తరువాత ప్రవీణ్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్ చార్జిషీట్ దాఖలు చేసి విచారణ చేపట్టారు. కేసు పూర్వపరాలను విన్న పోక్సో జడ్జి జయంతి బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడికి మూడేండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. శిక్ష పడేలా కృషి చేసిన పూర్వ సీఐలు ప్రవీణ్‌రెడ్డి, నరేశ్‌ను, ప్రస్తుత ఎస్‌హెచ్‌వో వినాయక్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగిలి సూర్‌రెడ్డి, భరోసా లీగల్ అధికారి సౌజన్య, కోర్టు లైజనింగ్ అధికారులు వెంకటేశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఎస్సైలను సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ అభినందించారు.

సంతకం ఫోర్జరీ కేసులో వ్యక్తి అరెస్ట్

అందోల్, నవంబర్ 22: గెజిటెడ్ ఆఫీసర్ సంతకాన్